## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం



వరలక్ష్మివ్రతం నిర్వహిస్తున్న మహిళాలు.

**కొడంగల్, ఆగస్టు5ప్రభాతవార్త :** శ్రావణ రెండవ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మివ్రతంను కొడంగల్ మండల వ్యాప్తంగా మహిళాలు భక్తిశ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. వరలక్ష్మివ్రతంను మహిళాలు కలశం ఏర్పాటు చేసి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి లక్ష్మిదేవిని ఆహ్వానించి, ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని సమర్పించిన అనంతరంసుమంగళికి పసుపు కుంకుమను సమర్పించి కార్యక్రమంను జరుపుకుంటారని మహిళాలు తెలిపారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## అక్రమార్కుల చేతుల్లో మాయమవుతున్న గుట్టలు

-రామసముద్రం కుంటను పూడ్చేస్తున్న వైనం
-బాంబులతో గుట్టలను తవ్వి సహజంగా వచ్చే కాలువను పూడుస్తున్న అక్రమార్కులు
-రామసముద్రం కుంటను కాపాడాలని కోరుతున్న ప్రజలు



రామసముద్రం కుంటలో పోసిన మట్టి

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 5, ప్రభాతవార్త:** గుట్టలు మాయమవుతున్నాయి. అక్రమార్కుల చేతుల్లో ప్రకృతి సంపద నామరూపంలేకుండ పోతొంది. ఇరిగేషన్ కాలువలను సైతం వదలకుండా పూడుస్తున్నారు. విచ్చల విడిగా బ్లాస్టింగ్ చేసి రాళ్లతో కాలువలను కుంటలను పూడుస్తూ సహజ సంపదను దోచేస్తున్నారు కొందరు అక్రమార్కులు. ఇదే ఇప్పుడు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలం చెన్నారెడ్డిగూడ గ్రామ సమీపంలో జరుగుతొంది. కొందరు భూ యజమానులు రామసముద్రం కుంటను పూడ్చేస్తున్నారు. ఈ రామసముద్రం కుంట ఇరిగేషన్ శాఖకు సంబందించినది. సహజసిద్ధంగా వచ్చే నీటీ కాలువను సైతం ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూడ్చరాదు. కాని భూ యజమానులు తమ ఇష్టానుసారంగా రాళ్లను బాంబులతో పేల్చి సహజ సిద్దంగా ఏర్పడ్డ కాలువలకు అడ్డుగా వేసి నీరు కుంటలోకి చేరకుండా కాలువలను మూసేస్తున్నారు.

**మాయమవుతున్న సహజ సిద్ధమైన గుట్టలు..**

చెన్నారెడ్డిగూడ సమీపంలోని రమసముద్రం కుంట వద్ద ఉన్న భారీ గుట్టలను పేలుడు సమాగ్రీని ఉపయోగించి బాంబులతో గుట్టలను పేల్చేస్తున్నారు. గతంలో వార్త దినపత్రికలో ప్రచూరితమైన కథనానికి స్పందించిన మంచాల సిఐ వెంకటేశం ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు కూడ నమోదు చేసారు. మళ్లీ ఇప్పుడు పేలుడు పదార్థలు వాడి రాళ్లను పగులగొట్టి కుంటలోకి వచ్చే నీటీ మార్గన్ని (కాలువలను) పూడ్చేస్తున్నారు. ఇంత జరుగుతున్న ఇరిగేషన్ అధికారులు నామమాత్రంగా సందర్శించి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి రామసముద్రం కుంటను కాపాడాలని చెన్నారెడ్డిగూడ గ్రామ ప్రజలు కొరుతున్నారు.

**గుట్టలను తవ్విన వారిపై చర్యలు తప్పవు : మంచాల తహసీల్దార్ అనిత**

చెన్నారెడ్డిగూడ సమీపంలోని రామసముద్రం కుంట పక్కనే గుట్టలను తవ్వేస్తున్నారని ఇప్పటికే పలు మార్లు ఫిర్యాదులు వచ్చాయని అలా అనుమతులు లేకుండా గుట్టలను తవ్వితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని మంచాల తహసీల్ధార్ అనిత తెలిపారు. ఇరిగేషన్ అధికారులతో చర్చించి వారితోపాటు రామసముద్రం కుంటను సందర్శించి కుంటను పూడ్చెవారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.



రామసముద్రం కుంటలోకి నీరు వెల్లకుండా సహజంగా ఏర్పడ్డ కాలువలో అడ్డుగా మట్టి,రాళ్లు వేసిన దృశ్యం

# దేశభక్తిని పెంపొందించేలా వజ్రోత్సవాలు

-పండుగ వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలి
-రాష్ట్ర మంత్రి సిహెచ్ మల్లారెడ్డి
-సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ హరీశ్
-8నుంచి 22వ తేదీ వరకు వజ్రోత్సవాలు



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో భారత స్వాతంత్ర్య వజ్రోత్సవ వేడుకల నిర్వాహణ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి,పాల్గొన్న కలెక్టర్ హరీశ్, అదనపు కలెక్టర్ జాన్ శ్యాంసన్, పలువురు అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 5, ప్రభాతవార్త**

దేశభక్తిని పెంపొందించేలా భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాలను పండుగ వాతావరణంలో వేడుకలు ఘనంగ జరుపుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సిహెచ్ మల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 8వ తేదీ నుంచి 22వరకు వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ప్రతి ఒక్కరు ఆనందోత్సవాలతో స్వాతంత్ర్య వజ్రోత్సవాలను జరుపుకోవాలని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని ఆయన సూచించారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో స్వాతంత్ర్య వజ్రోత్సవాలను పురస్కరించుకుని కలెక్టర్ హరీశ్‌తో కలిసి అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ప్రజలందరిలో మేల్కొలిపేలా వేడుకలు అంగరంగ వైభవంగా స్వాతంత్ర్య వజ్రోత్సవాలు నిర్వహించాలన్నారు. ఈ నెల 8నుంచి 22వ తేదీ వరకు గ్రామాల్లో, పట్టణాలతో పాటు అన్నిచోట్ల, అదే విధంగ ఇళ్లపై కూడ జాతీయపతాకాన్ని ఎగురవేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లు, మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్లు పట్టణాల్లో, గ్రామాల్లోనూ ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు దేశభక్తిని పెంపొందించే విధంగ భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాలను నిర్వహించాలని, జిల్లా వ్యాప్తంగ ప్రజలు అందరు మేల్కొనేలా అడుగుఅడుగునా దేశభక్తి భావనను కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని అధి కారులను మంత్రి ఆదేశించారు. స్వాతంత్ర్య పోరాటాన్ని స్ఫూర్తిగ తీసుకుని అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. పాఠశాల విద్యార్థులు, ఉద్యోగులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, యువతీ, యువకులు ఈ ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని మల్లారెడినడ పిలుపు నిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వజ్రోత్సవాలను నిర్వహించుకుంటున్న ప్రస్తుత తరుణంలో ప్రభుత్వం చేపట్టబోయే అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. జిల్లా వ్యాప్తంగ 2లక్షల పై చిలుకు జాతీయపతాకాలను ఇంటింటికి అందించేందుకు సిద్దంగ ఉన్నట్లు మంత్రి వివరించారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ సిఎం ఆదేశాల మేరకు వజ్రోత్సవాలను ఘనంగ నిర్వహించటానికి అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 8నుంచి 22వ తేదీ వరకు జరిగే స్వాతంత్ర్య వజ్రోత్సవ కార్యక్రమ వివరాలను కలెక్టర్ వెల్లడించారు. 8న భారత స్వాతంత్ర్య వజ్రోత్సవ ద్విసప్తాహం ప్రారంబోత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 9న ఇంటింటికి జాతీయ పతకాల పంపిణీ, 10న వజ్రోత్సవ వనమహోత్సవంలో భాగంగ గ్రామ గ్రామాల మొక్కలు నాటటం, ఫ్రీడమ్ పార్కుల ఏర్పాటు, 11న ఫ్రీడమ్ రన్ నిర్వహాణ ఉంటుందన్నారు. ఆగస్టు 12న రాఖీ ఫౌర్ణమిని పురస్కరించుకుని మీడియా సంస్థల ద్వారా వజ్రమహోత్సవ కార్యక్రమాలప్రసారాలకు విజ్ఞపి, 13న విద్యార్థులు, యువకులు, మహిళలు వివిధ సామాజిక వర్గాల భాగస్వామ్యంతో వజ్రోత్సవ ర్యాలీలు, ఆగస్టు 14న సాయంత్ర సాంస్కృతిక సారధి కళాకారులచే నియోజక వర్గ కేంద్రాల్లో ప్రత్యేక సాంస్కృతిక జనాపద కార్యక్రమాలు, ప్రత్యేకంగ బాణసంచా వెలుగులు విరజిమ్మటం చేయాలని వివరించారు. 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున వేడుకలను అన్ని చోట్ల నిర్వహించాలన్నారు. ఆగస్టు 16న జిల్లా వ్యాప్తంగ ఏకకాలంలో ఎక్కడి వారక్కడ తెలంగాణ వ్యాప్తంగ సామూహిక జాతీయ గీతాలపణ, సాయంత్రం కవిసమ్మేళనాలు, ముషాయిరాల నిర్వాహణ, 17న రక్తదాన శిబిరాల నిర్వాహణ, ఆగస్టు 18న ఫ్రీడమ్ కప్ పేరుతో క్రీడల నిర్వాహణ ఉంటుందని, ఆగస్టు 19న దావాఖానాలు, వృద్దాశ్రమాలు, అనాధ శరణలయాలు, జైళ్లలో ఖైదీలకు పండ్లు, స్వీట్ల పంపిణీ, 20న దేశభక్తిని జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా ముగ్గుల పోటీలు నిర్వహించటం జరుగుతుందని కలెక్టర్ హరీశ్ తెలిపారు. 21న అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఇతర స్థానిక సంస్థల ప్రత్యేక సమావేశాలు, ఆగస్టు 22న హైదరాబాద్‌లోని లాల్‌బహద్దుర్ స్టేడియంలో ముగింపు వేడుకలు జరుగుతాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగ స్వాతంత్ర్య వజ్రోత్సవాలకు సంబంధించి చేపట్టబోయే కార్యక్రమాలను ముందస్తు ప్రణాళిక రూపొందించామని అన్నారు. ఈ ప్రణాళిక ప్రకారం వజ్రోత్సవాలను అందరు సమన్వయంతో ఉండి విజయవంతం చేయాలని కలెక్టర్ హరీశ్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ జాన్ శ్యాంసన్, లింగ్యా నాయక్ (ఎఫ్ఎసి), డిసిపి రక్షితమూర్తి, కుశాయిగూడ ఎసిపి సాధన రష్మి పెరుమాళ్, ఆర్డీఓలు రవి, మల్లయ్య, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## త్వరగా బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలి



వర్షానికి కొట్టుకుపోయిన చర్లగూడ బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**షాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త :** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చర్లగూడ గ్రామానికి వెళ్లె బ్రిడ్జి పూర్తిగా కొట్టుకుపోయి, గ్రామానికి రాకపోకలు బంద్ కావడంతో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య పరిశీలించారు. అదేవిధంగా నాగర్‌గూడ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... చర్లగూడ గ్రామ ప్రజలు ఇబ్బంది పడకుండా రూ.2.50కోట్లతో బ్రిడ్జి నూతన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. అధిక వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, నాయకులు శ్రీరాంరెడ్డి, కౌకుంట్ల రాజేందర్‌రెడ్డి, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

## కనీస సౌకర్యాలు కరవు..ఇబ్బందుల్లో ప్రజలు

-రోడ్లు, డ్రైనేజీ తీర్మానాలకే పరిమితం -అభివృద్ధిలో కాలనీపై వివక్ష

**ఘట్‌కేసర్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం ఘణాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని నారాయణకాలనీలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పవర్ గ్రిడ్ వద్ద ఉన్న కాలనీలో రోడ్లు, భూగర్భడ్రైనేజీ నిర్మాణం చేయకపోవడంతో ఇళ్ల మధ్య మురికినీరు పారుతున్నది. లేఔట్‌లో కేటాయించిన రోడ్లు కూడా సక్రమంగా లేక వాహనాల రాకపోకలకు ఇబ్బంది కల్గుతున్నది. భూగర్భడ్రైనేజీ, సిసి రోడ్ల నిర్మాణం చేస్తామని గ్రామపంచాయతీ పాలకవర్గంతో 3 సార్లు తీర్మాణాలు చేసినప్పటికి నిధులు మంజూరు చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటికి గోదావరి జలాలు సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతుందని ఇక్కడ మాత్రం కనెక్షన్లు ఇచ్చారే తప్ప గోదావరి, కృష్ణాజలాలు అందించడం లేదని వాపోతున్నారు. సర్వేనంబర్లు 1119, 1120, 1121 లలోని వెంచర్లలో కొత్త ఇండ్ల నిర్మాణం జరుగుతుందని కానీ సదుపాయాలు మాత్రం మెరుగు పడటం లేదన్నారు. కాలనీ విస్తరిస్తున్నా రోడ్డు, డ్రైనేజీ, నీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇళకల మధ్య ఖాళీ స్థలాలో చెత్తాచెదారం పేరుకుపోయి విషపురుగులు, పాముల భయం నెలకొందని తెలిపారు. లేఔట్లలో పార్కు, సామాజిక అవసరాలకు కేటాయించిన స్థలాలు కనీసం శుభ్రం కూడా చేయడం లేదని కొన్ని దశాబ్దాల క్రితం కాలనీ ఏర్పడినప్పటికి పార్కు కూడా ఏర్పాటు చేయలేదని తెలిపారు. కొత్తగా ఏర్పడిన వినాయకనగర్‌కాలనీలో సిసిరోడ్డు, డ్రైనేజీ, వీధిదీపాలు, గోదావరిజలాలు కల్పించారని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో పార్కు స్థలాలు పరిరక్షించి ఫెన్సింగ్ వేయడం, ఇతర అభివృద్ధి చేసి పిల్లలకు ఆటల కోసం సౌకర్యవంతంగా చేయాలని ఆదేశిస్తున్నా ఆచరణలో ఏలాంటి పనులు కావడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. వర్షాలకు గుంతలు పడగా మట్టి తెచ్చి పోసి చాలా రోజులు గడుస్తున్నా గుంతలు సరిగి పూడ్చకుండా మట్టి కుప్పలు అలాగే వదిలివేశారని వాపోయారు. ప్రజాప్రతినిధులకు, సిబ్బందికి పలు సార్లు మొరపెట్టుకున్నా ఏలాంటి స్పందన లేదని ఇకనైనా తమ కాలనీలో కనీస సదుపాయాలు కల్పించాలని వారు కోరుతున్నారు.



ఘణాపూర్ పవర్‌గ్రిడ్ వద్ద గుంతలో మట్టిపోసి వదిలివేసిన దృశ్యం

# అక్రమ నిర్మాణాలు నిర్మిస్తే చర్యలు తప్పవు

-గుర్తించినవి ఇళ్లు వందల్లో... కూల్చినవి 25 ఇళ్లు
-అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తుండగా ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు
-అక్రమ నిర్మాణాలను అరికట్టడంలో అధికారులు విఫలం





కీసరలో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లను జేసిబీ సహాయంతో కూల్చివేయిస్తున్న ఎంపిఓ మంగతాయారు,పంచాయతీ కార్యదర్శి సునీత

**కీసర, ఆగస్టు5, ప్రభాతవార్తః** మండల కేంద్రమైన కీసరలో అక్రమ నిర్మాణాలు నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని మండల ఎంపిఓ మంగతాయారు హెచ్చరించారు. శుక్రవారం కీసరలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వివిధ కాలనీలలో 25 అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లను జేసిబీ సహాయంతో కూల్చివేశారు. అక్రమ నిర్మాణాలు కూల్చివేసేటప్పుడు స్థానిక ప్రజాప్రతినిధుల నుండి ఎన్ని ఎత్తిళ్లు వచ్చినా లెక్కచేయకుండా కూల్చివేయించారు. కీసరలో వార్డు సభ్యులు సైతం అక్రమ నిర్మాణాలు చేయడం జరుగుతుందని వారికి కూడా నోటీసులు జారీ చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. కీసరలో వందల సంఖ్యలో ఇండ్లు నిర్మిస్తుంటే అందులో కొన్నింటిని మాత్రమే కూల్చివేయడం వెనుక ఉన్న అంతర్యమేమిటని స్థానికులు గుసగుసలాడుకున్నారు. అక్రమంగా ఎన్నో ఇళ్లు నిర్మిస్తుంటే అందులో కొన్నింటిని మాత్రమే కూల్చివేస్తున్నారని స్థానికులు అధికారులను అడుగగా తమకు ఫిర్యాదులు వచ్చిన నిర్మాణాలను పరిశీలించి గృహ నిర్మాణాదారులకు నోటీసులు సైతం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎంపిఓ మంగతాయారు మాట్లాడుతూ నోటీసులు జారీ చేసినా మళ్లీ అక్రమంగా ఇళ్లను నిర్మిస్తున్న వాటిని ప్రస్తుతం కూల్చివేయడం జరిగిందన్నారు. పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఎక్కడ అక్రమ నిర్మాణాలు జరిగినా ప్రతి ఇంటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు, ఇతర ప్రజాప్రతినిధులకు డబ్బులు ఇచ్చి అనధికారికంగా నిర్మాణాలు చేపట్టే వారికి అంతకు రెట్టింపు జరిమానాలతో పాటు అక్రమ నిర్మాణాలను చేస్తే వాటిని నిర్ధాక్షిణంగా కూల్చివేస్తామన్నారు. ఎవరైనా నిర్మాణాలు చేయదలచిన వారు పూరి స్థాయిలో హెచ్ఎండిఏ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ కట్టుకుని, పంచాయతీ హెచ్ఎండిఏల ద్వారా నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకుని ఎవరికి మామూలుఇవ్వకుండా నిర్మాణాలు చేసుకోవాలని సూచించారు. దీనికి పంచాయతీ కార్యదర్శులు సూచనలు చేస్తారని, ప్రతి నిర్మాణదారులు నిబంధనలు పాటించాలని ప్రజలకు ఎంపిఓ మంగతాయారు తెలిపారు. ఇంకా కీసరలో మా దృష్టికి వచ్చిన అక్రమ నిర్మాణాలు వందల్లో ఉన్నాయని నివేదిక తెప్పించుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సునీత, సుదర్శన్, అమీన్, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో కుటుంబ పాలన... దేశంలో కష్టాల పాలన

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జీ వీర్లపల్లి శంకర్
- పెరిగిన నిత్యావసర ధరలకు నిరసనగా పట్టణ పురవీధుల్లో కాంగ్రెస్ ర్యాలీ
- షాద్‌నగర ముఖ్య కూడలీలో కేసీఆర్, మోడీ దిష్టిబొమ్మల దగ్ధం



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**షాద్‌నగర్, ఆగస్టు 5, (ప్రభాతవార్త) :** రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలనలో, దేశంలో మోడీ కష్టాల పాలనలో రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తి అస్తవ్యస్తంగా మారిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జీ వీర్లపల్లి శంకర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర పాలనలో పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, యువనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు షాద్‌నగర్ నియోజకవర్గం ఇంఛార్జీ వీర్లపల్లి శంకర్ ఆద్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని పురవీధుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను విమర్శిస్తూ, వ్యతిరేక నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. నరేంద్ర మోడీ, కేసీఆర్ దిష్టిబొమ్మలకు పాడే కట్టి ఊరేగింపు నిర్వహించి, పట్టణ ముఖ్యకూడలీలో దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జీ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కేసీఆర్, కేంద్రంలో మోడీ ఇష్టానుసారంగా పాలనలు చేస్తూ సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంల కుటుంబ పాలన... దేశంలో కష్టాల పాలనలో అన్ని విధాల ప్రజలను మోసం చేస్తూ వారు మాత్రం రాజబోగాలు అనుభవిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. జీఎస్టీ లాంటి పథకాలను తీసుకువచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యలను నిలువునా దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. నిత్యవసరాలు అయిన ఉప్పు, పప్పుల నుంచి సిలిండర్, పెట్రోల్, డీజిల్ వరకు ఇలా అన్ని రకాల వస్తువులను ఇష్టానుసారంగా ధరలను పెంచుకుంటూ ప్రజలను అధః పాతాళానికి తొక్కేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో పేద ప్రజల పక్షాన, కార్మికుల పక్షాన, రైతుల పక్షాన, విద్యార్థుల పక్షాన నిరంతరం కాంగ్రెస్ పాపర్టీ పోరాడుతుదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బాబార్‌ఖాన్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు సత్యనారాయణ, నందిగామ మండల అధ్యక్షుడు జంజగ నరసింహా, కిసాన్ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, ఐఎన్టీయూసీ రఘు, ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, కుమారస్వామిగౌడ్, చంద్రపాల్‌రెడ్డి, పర్వతాపూర్ ఎంపీటీసీ మల్లేష్‌గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ అంజియాదవ్, రామస్వామి, రూప్‌సింగ్, బుచ్చన్న, సత్తయ్య, మేకకూడ సర్పంచి పాండురంగారెడ్డి, ఫరూఖ్‌నగర్ మండల ఉపాధ్యక్షుడు సుదర్శన్, జంగయ్యగౌడ్, కొత్తూరు నర్సింహులు, మాజీ ఎంపీటీసీ సురేష్, ఎస్సీ సెల్ అంతయ్య, సీతారాం, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ నాగి సాయిలు, కొత్తూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనంతయ్య, శ్రీనునాయక్, సామయ్య, మంకాల శ్రీశైలం, యూత్ కాంగ్రెసన నాయకులు అర్జున్ లక్ష్మణ్, ఢిల్లీ గణేష్, గంటెల శేఖర్, ఆవుల సత్యనారాయణరెడ్డి, దయాకర్, దశరథ్, శ్రీకాంత్, లడ్డు, మురళీ, యాదగిరి, గణేస్ ఖాజా, ఎల్లయ్య, రమేష్, అయూబ్, బుగ్గ శ్రావణ్, మహమ్మద్, కృష్ణ, యాదయ్య, చింపోడ్ శ్రీధర్, బుడ్డ నరసింహా, ఆంజనేయులు, గుట్ట రాజు, బాలరాజు, అందే శ్రీకాంత్, లింగారెడ్డిగూడ ఆశోక్, నవీన్, శేఖర్, మామిడిపల్లి నవీన్, పద్మారం వెంకటేష్, గంగముని సత్తయ్య, మామిడిపల్లి సతీష్, కోస్గి బాలు, మహమ్మద్ అస్మత్, శివ, కుమార్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎఫ్‌సీకాలనీలో వికసించిన బ్రహ్మకమలం

**ఘట్‌కేసర్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీనగర్‌లో అరుదైన బ్రహ్మకమలం వికసించింది. పుష్పాలలో ఏడాదికి ఒకేసారి పూసే పువ్వుగా ప్రత్యేకత కలిగి ఉన్నది. ఎన్ఎఫ్‌సీ కంపెనీ విశ్రాంత ఉద్యోగి అలపాటి మల్లికార్జునరావు ఇంటి ఆవరణలో వివిధ రకాల పువ్వులు, పండ్ల చెట్లను పెంచుతున్నారు. ఆలయ ఇంట్లో నాలుగు మొక్కలకు అర్ధరాత్రి బ్రహ్మకమలం పుష్పాలు రాత్రి విచ్చుకొని తెల్లవారూమున తిరిగి మూసుకుపోయాయి. చీకట్లో వెలుగులు విరజిమ్ముతూ తెలుపు వర్ణంలో పూసిన పుష్పాలు చూపరులను విశేషంగా ఆకర్షించాయి. బ్రహ్మకమలం అంటే బ్రహ్మ కూర్చునే పువ్వు అని అర్థం. హైందవ సాంప్రదాయంలో దీనికి చాలా విశిష్టత ఉందని చెబుతారు. ఈమొక్కపై ఆకులే పుష్పంగా రూపాంతరం చెందడం ప్రత్యేకతగా చెబుతారు. ఈ అరుదైన పుష్పం ఆయన ఇంటి ఆవరణలో పెంచిన మొక్కలకు పూయడం తమకు ఆనందంగా ఉందని మల్లికార్జునరావు పేర్కొన్నారు. ఇరుగుపొరుగు జనం వచ్చి బ్రహ్మకమలాలను చూసి పరవశించిపోయారని కొందరు పూజలు చేశారని, ప్రతి సంవత్సరం ఇక్కడ పుష్పాలు విరగబూస్తున్నాయని తెలిపారు.



ఎన్ఎఫ్‌సీనగర్‌లో వికసించిన బ్రహ్మకమలం పుష్పాలు

## బంజారా నూతన అధ్యక్షుడిగా జర్పుల విజయ్



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

**మాడ్గుల, ఆగష్టు5, ప్రభాతవార్త:-**
మాడ్గుల మండల బంజారా నూతన అధ్యక్షులుగా జర్పుల తాండకు చెందిన టీఆర్ఎస్ పార్టీ ఎస్టీసెల్ అధ్యక్షులు జర్పుల విజయ్ కుమార్ నాయక్‌ను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఆంజనేయస్వామి ఆలయంలో బంజారా నాయకులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సలహాదారులుగా కాట్రావత్ సురేష్‌నాయక్, ఉపాధ్యక్షులుగా రఘునాయక్, రూపాదేవి, కార్యదర్శిగా నరేష్‌నాయక్, కార్యనిర్వహణ సభ్యులుగా హరిలాల్‌నాయక్, మోహన్, బాలు, సాగర్‌లను ఉన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షులు విజయ్ కుమార్ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్ష భాద్యులు అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 14 నుండి 22వరకు మండల కేంద్రంలో తీజ్ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటి మొదటి సమావేశంలో తీర్మానం చేసినట్లు అన్నారు. తీజ్ వేడుకలకు అనుమతి కోరుతూ తహసీల్దార్ దేవుజకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజునాయక్, బద్యనాయక్, సిద్దునాయక్ తదితరులు పాల్గోన్నారు.

## బిజెపి వీడి కాంగ్రెస్‌లోకి గిరిజన యువనేత

**నందిగామ ఆగస్టు5, ప్రభాతవార్త :** సంచలన రాజకీయాలకు మారుపేరైన నందిగామ మండలంలోని తాటిగడ్డ తండాలో ఓ గిరిజన యువనేత కాంగ్రెస్ పార్టీలో చెరుతున్నట్లు విశ్వసనీయ సమాచారం ద్వారా తెలిసింది. మండలంలోని బిజెపి గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న జెట్టావత్ వినోద్ (డిజె) పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చెరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తుంది. తాను పని చేసిన పార్టీలో తగిన గుర్తింపు ఇవ్వకపోవడం చేతనే పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చెరుతున్నట్లు గత కొన్ని రోజులుగా కాంగ్రెస్ అగ్రశ్రేణీ నాయకులతో సంప్రాదింపులు జరిపి భవిష్యత్ కార్యాచరణపై వినోద్ కుమార్ నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ నాయకుల ద్వారా పుకార్లు షీకార్లు కోడుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సారథ్యంలో పని చేస్తున్న షాద్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు సన్నాహలు చేస్తున్నట్లు చర్చలు ఏది ఎమైన మండలంలో మంచి పట్టున్న గిరిజన యువ నాయకుడు కాంగ్రెస్‌లోకి రావడాన్ని ఆ పార్టీ నేతలు సైతం స్వాగతించేందుకు సిద్ధంగా ఉన్నట్లు గుస గుసలాడుతున్నారు.

## సమాజ సేవలో కడేంపల్లి శ్రీనివాస్ గౌడ్
### -ఆభాగ్యురాలకి ఇల్లు కట్టిస్తున్న వైనం



రంగాపూర్ గ్రామంలో కొత్త ఇంటి నిర్మాణంలో భాగంగా దర్వాజ ఎక్కించిన దృశ్యం

**నందిగామ ఆగస్టు5, ప్రభాతవార్త :**
మానవ సేవయే మాధవ సేవయె మధవసేవగా భావించిన కొత్తూరు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కడెంపల్లీ శ్రీనివాస్ గౌడ్ నిలువ నీడలేని ఓ ఆ భాగ్యురాలికి ఇల్లు నిర్మాణానికి శ్రీకారం చుట్టి పలువురికి ఆదర్శంగా నిలిచారు. నందిగామ మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో జిల్లెల చెన్నమ్మకు చెందిన ఇల్లు గత సంవత్సరంలో కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిని కూలడానికి సిద్ధమైంది. గత మూడు నెలల క్రితం ఇంటింటికి రైతు డిక్లరేషన్ గడప గడపకు కరపత్రాల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన కడెంపల్లీ చెన్నమ్మ దయానీయ స్థితిని గమనించి ఇల్లు కట్టిస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం శిథిలావస్థకు చేరిన పాత ఇంటిని కూల్చి కొత్తగా ఇంటి నిర్మాణ పనులను చెపట్టారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పవిత్ర దినం శుభ సందర్భంగా ఇంటి దర్వాజ ఎక్కించి పూజలు చేశారు. పూజలకు సహాయ సహకారాలు అందించిన వారిలో యువజన కాంగ్రెస్ సీనియర్‌నేత క్రరోళ్ళ సురేందర్, బాధితురాలు చెన్న మ్మ, ఆమె కుమారుడు తదితరులున్నారు.

## ప్రజా సంగ్రామ యాత్రలో మండల నాయకులు



**మొయినాబాద్ అగస్టు 5, ప్రభాతవార్త :**
బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజేయ్ ప్రారంభించిన 3 విడత ప్రజా సంగ్రామ యాత్రలో భాగంగా శుక్రవారం మొయినాబాద్ మండల బిజెపి అధ్యక్షుడు మధుసుదన్ రెడ్డి మరియు నాయకులు, భువనగిరి జిల్లా పోచ్చంపల్లి మండలం రావులపల్లి గ్రామంలో బండి జంజేయ్ తో యాత్రలో పాల్గోన్నారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుష పాలనను అంతమోందించేదాక బిజెపి నాయకులు, కార్యకర్తలు బండి సంజేయ్ వెంటనడుస్తామని అన్నారు, త్వరలోనే కేసిఆర్ పోగరుబోతు పాలనకు ప్రజలు స్వస్తిపలికే రోజులు దగ్గర పడ్డాయన్నారు, ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు సన్వేల్లి ప్రభాకర్ రెడ్డి, మండల కార్యదర్శి గుమ్మాల సీతారాం రెడ్డి, రాజుగౌడ్, దళితమోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్, కోశాధికారి ప్రభుయాదవ్, వీరేశం, బిజెవైఎం గోపికాంత్, చంద్రశేఖర్ రెడ్డి, ఎల్లేష్‌గౌడ్, శివకుమార్, రవిందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మధుసుదన్ ప్రవీణ్, తధితరులు పాల్గోన్నారు,

## 12వ రోజుకు చేరుకున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు

**షాద్‌నగర్, ఆగస్టు 5, (ప్రభాతవార్త) :** కేంద్ర ప్రభుత్వం మాదిగల పట్ల తీవ్ర వివక్ష చూపుతుందని, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేపడుతామని హామీ ఇచ్చి నేటికి కూడ నేరవేర్చుకోలేకపోయిందని ఎమ్మార్పీఎస్ నాయకులు తీవ్రస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన దీక్ష శిభిరంలో ఎమ్మార్పీఎస్ అర్ధనగ్న నిరసనలు తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ కన్వీనర్ పెంటనోళ్ల నరసింహా మాదిగ మాట్లాడుతూ... మాదిగ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును వెంటనే అమలు చేయాలని, లేనిచో తమ ఆందోళన కార్యక్రమం మరింత ఉద్భృతం చేస్తామని ఆయన తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. నరేంద్రమోడీ ఎన్నికలప్పుడు 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెడుతామని ఇప్పటి వరకు చేయడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ఈ పార్లమెంట్ సమావేశంలోనే ప్రవేశపెట్టి తమ మాట దక్కించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రామచంద్రయ్య, బాల్‌రాజ్, శ్రీను, నాగభూషన్, పాండు, దాసరి వెంకటయ్య, యాదయ్య, డోలు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



అర్థనగ్నంగా నిరసనలు తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 5, ప్రభాతవార్త**
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగ నిర్వహించాలని జిల్లా అధికారులకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్ సూచించారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వాహణపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగ కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అధికారులందరు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఎంతో జాగ్రత్తగా వ్యవరించాలన్నారు. కలెక్టరేట్ ముందు ప్రాంగణంలో నిర్వహిస్తున్నందున బారికేట్స్ కలెక్టరేట్ బయటకు, లోపలికి వెళ్లెదారిని ఇబ్బందులు లేకుండ చూడాలన్నారు. పోలీసుబందోబస్తు ఏర్పాటు చేయాలని, పేరెడ్ ఏర్పాట్లను చూడాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అంత శుభ్రంగ ఉండేలా, రోడ్లు పక్కలన ముళ్ల, పొదలను తొలగించాలని, గ్రౌండ్‌లో వాటరింగ్ చేయించాలని డిపిఒకు సూచించారు. వేధికను పూలతో అలంకరణలు చేపట్టేలా ఉద్యానవన అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండ చూడాలన్నారు. సంబంధిత అధికారులు బాధ్యతగ వ్యవరించి వేడుకలను ఘనంగ నిర్వహించాలన్నారు. వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటుకు అధికారులు సిద్ధం కావాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులచేత సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు సూచించారు. విధి నిర్వాహణలో ప్రతిభను చాటిన ఉద్యోగులకు ప్రశంసపత్రాలు అందించనున్నట్లు, దీనికి సంబంధించి అధికారులు వివరాలు సిద్దంగ ఉండాలన్నారు. ఆ తరువాత స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానాలు ఉంటాయని, ఏర్పాట్లు చేయాలన్నారు. దీనిలో ఆర్డీఓలు రవి, మల్లయ్య, పోలీస్ అధికారులు, జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



.మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వాహణపై జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరీశ్, పాల్గొన్న అధికారులు

## జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం



షాబాద్‌లో శ్రీసరస్వతీ శిశుమందిర్ వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు

**షాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త :**
శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా మండల కేంద్రంలో శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో వరలక్ష్మివ్రతం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు శ్రీనివాసాచారి ప్రత్యేక పూజలు చేయించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.



వరలక్ష్మీ వ్రత పూజల్లో పాల్గొన్న ఎంపిపి

**తలకొండపల్లి ఆగస్టు5, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల ఎంపిపి తిరుమణి నిర్మల శ్రీశైలం గౌడ్ తన స్వగృహంలో కుటుంబ సభ్యులతో కలిసి వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో అష్టశ్వర్యాలతో ఆరోగ్యంగా జీవించాలని రైతన్నలకు మంచి దిగుబడులు రావాలని వరలక్ష్మీ అమ్మవారిని కోరుకున్నట్లు ఆమె పేర్కొన్నారు.



రావిర్యాలలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు

**కొందుర్గు, ఆగస్టు 5, (ప్రభాతవార్త) :** వరలక్ష్మీ వ్రతమును ఉమ్మడి మండలాల్లో భక్తిశ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. చౌదరిగూఎం మండలం రావిర్యాల గ్రామంలో గల శ్రీ సుబ్రమనేశ్వర స్వామి ఆలయం ప్రాగణంలో వరలక్ష్మీ అమ్మవారిని ఆలంకరించి మహిళ భక్తులు భక్తి శ్రద్దలతో వ్రతం చేసి మొక్కుబడులను తీర్చుకున్నారు. అలాగే రెండు మండలాల్లోని పలు దేవాలయలల్లో ఇండ్లల్లో వరలక్ష్మీ వ్రతంను చేసి మొక్కుబడి తీర్చుకున్నారు.

## పచ్చదనం-పరిశుభ్రతను పెంపొందించేందుకు కృషి

**ఘట్‌కేసర్, ఆగష్టు 5, ప్రభాతవార్త:**
పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ 7వ వార్డు గుంటిగూడెంలో శుక్రవారం 8వ విడత హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్, వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, కౌన్సిలర్ సల్లూరి నాగజ్యోతిలు గుంటిగూడెంలోని స్మశానవాటికలో పలు చోట్ల మొక్కలు నాటి నీరు పోశారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపడుతున్నామని ప్రజలు కూడా మొక్కలకు నష్టం జరగకుండా చూడాలని సూచించారు. ప్రజలందరూ గూడెంలో మొక్కలు పెంచి పచ్చధనం పెంచేందుకు శ్రద్ద చూపాలని పేర్కొన్నారు. వార్డు ఇంచార్జ్ రాకేశ్, నాయకులు రాజు, అమర్ తదితరులు పాల్గొన్నారు.

**10వ వార్డులో హరితహారం**
ఘట్‌కేసర్ మున్సిపల్ 10వ వార్డులో శుక్రవారం 8వ విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా కొండాపూర్ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. మున్సిపల్ కమీషనర్ ఎన్.వసంత, స్థానిక కౌన్సిలర్ బర్ల శశికళ దేవేందర్‌లు పలు చోట్ల మొక్కలు నాటి నీరు పోశారు. నాయకులు కేశవపట్నం అంజనేయులుతో పాటు స్థానికులు హరితహారంలో పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ మున్సిపల్ గుంటిగూడలో మొక్క నాటుతున్న చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్

## చేతగాని ప్రభుత్వాన్ని గద్దె దించుతాం



ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**కొత్తూర్, ఆగస్టు 5, ప్రభాతవార్త :**
పెరిగిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టేందుకు ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు కొత్తూర్ పురపాలికలో షాద్‌నగర్ నియోజకవర్గ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాలనుసారం శుక్రవారం కొత్తూర్ పురపాలిక కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్‌లో నేత కౌన్సిలర్ మాదారం నరసింహ్మగౌడ్ ఆధ్వర్యంలో పెంజర్ల బైపాస్ వద్ద కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలపై నిత్యావసర ధరలు పెంచినందుకు కురిసిన వర్షాలకు నిరాశ్రయులైన వరద బాధితులను ఎటువంటి సహాయ సహకారాలు అందించకుండా నిర్లక్ష్యం చేసినందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై నిరసన కార్యక్రమం చేపట్టి నరేంద్రమోడీ, కేసీఆర్ దిష్టిబోమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు వీరమోని దేవేందర్‌ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, మాదారం కృష్ణగౌడ్, గోపాల్ గౌడ్, నియోజకవర్గం ఎస్సీసెల్ అధ్యక్షులు కరోళ్ల సురేందర్, కాంగ్రెస్ పార్టీ నాయ కులు కొండారెడ్డి విష్ణుమూర్తి, వీరమోని వెంకటేష్, బాలునాయక్, ఉటుపల్లి నర్సింహ్మగౌడ్, మాదారం పరందాములుగౌడ్, లక్ష్మయ్య, నవీన్‌చారి, విజయ్, బాలు, గోపాల్‌నాయక్, బాలు, వీరమోని నర్సింహ్మముదిరాజ్, మహేష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## విఆర్ఎల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలి



వీఆర్ఏల దీక్షకు

**కొందుర్గు, ఆగస్టు 5, (ప్రభాతవార్త) :**
తమ హక్కుల సాధన కోసం గ్రామ సహాయకులు వీఆర్ఏలు చేస్తున్న రిలే నిరహార దీక్షకు దళిత సమాజ్ పార్టీ మద్దతిస్తున్నట్లు ఆపార్టీ చౌదరిగూడెం మండల శాఖ అధ్యక్షుడు బిక్షపతి మహారాజ్ తెలిపారు. శుక్రవారం ఆయన చౌదరిగూడెం, కొందుర్గు మండలాల్లో వీఆర్ఏలు చేపట్టిన నిరహార దీక్ష శిభిరాలను సందర్శించి సంఘీభావం ప్రకటించారు.. ఈ కార్యక్రమంలో నాయకులు రాములు, నరేష్,, నర్సింహులు, సిద్దు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు. మద్దతు తెలుపుతున్న డీఎస్పీ నాయకులు

**మొయినాబాద్ మండలంలో**
**మొయినాబాద్ అగస్టు 5, ప్రభాతవార్త :** వీఆర్ఏలు న్యాయమైన డిమాండ్‌ల వెంటనే పరిష్కరించాలని మండల జర్నలిస్టులు డిమాండ్ చేశారు. శుక్రవారం మొయినాబాద్ మండల తహశిల్దార్ కార్యాలయం ముందు దీక్ష కోనసాగిస్తున్న వీఆర్ఏలకు మొయినాబాద్ మండల రిపోర్టర్లు శ్రీనివాస్, రాజు, వాసు మేము సైతం వీఆర్ఏల న్యాయమైన డిమాండ్ పరిష్కరించాలని దీక్ష శిబిరంలో కూర్చోని మద్దతు తెలిపారు. అనంతరం వీఆర్ఏలు తమ యొక్క ఉద్యోగాలను వదిలేసి 15 రోజుల నుండి దీక్ష చేస్తున్న వీఆర్ఏల ఒక రోజు భోజన ఖర్చుకోసం ఆర్థికంగా సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్ఏలు జర్ణలిస్టులు శ్రీను, వాసు తదితరులు పాల్గొన్నారు.

## హత్యకు గురైన గుర్తు తెలియని వ్యక్తి

**మేడ్చల్, ఆగస్టు 5. ప్రభాతవార్త ః**
హత్యకు గురైన ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహన్ని మేడ్చల్ పోలీసులు కనుగొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి శామీర్‌పేటమండలంలోని మురారిపల్లి గ్రామ శివారులో గల సీవీఆర్ కళాశాల సమీపంలో రాజీవ్ రహదారి పక్కన ఓ వ్యక్తి మృతదేహన్ని శుక్రవారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరు కున్న పోలీసులు పరిశీలించారు. మృతుడుని హత్య చేసి అనవాలు తెలి యకుండా ఉండేందుకు కిరోసిన్‌పోసి కాల్చివేసినట్లు పోలీసులు ప్రాథమి కంగా గుర్తించారు. మృతుడి నాలుకవెలుపలికి ఉండి, అతని శరీరం కాలి పోయి ఉంది. సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు వయస్సు గల అతను హత్యకు గురైనట్లు ఆనవాలు ఉన్నాయని, మృతదేహం పక్కన కిరోసిన్‌వాసనతో కూడిన ఓ బాటిల్, అగ్గిపెట్టె ఉందని పోలీసులు పేర్కొన్నారు. ఆధారాలు చేకరించిన పోలీసులు పంచనామా అనంతరం మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

## సెల్‌టవర్ ఏర్పాటుపై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు
### -గ్రామానికి దూరంగా నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

**శామీర్‌పేట, ఆగస్టు 5, ప్రభాతవార్త**
జగ్గంగూడ గ్రామంలో జనావాసాలకు అతి సమీపంలో సెల్‌టవర్‌ను ఏర్పాటు చేయటానికి నిర్మాణ పనులు చేపడుతున్నారని, గ్రామానికి దూరంగ సెల్‌టవర్ ఏర్పాటు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని జగ్గంగూడ గ్రామానికి చెందిన పలువురు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంపై స్పందించి గ్రామానికి దూరంగ సెల్ టవర్ ఏర్పాటు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. గ్రామ ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేసినా జనావాసాలకు దగ్గరగా అత్యధిక రేడియేషన్ విడుదలయ్యే సెల్‌ఫోన్‌టవర్‌ను నిర్మిస్తున్నారని అన్నారు. సెల్‌టవర్ నుంచి భవిషత్‌లో వచ్చే రేడియేషన్ వల్ల గ్రామంలోని సమీప కాలనీవాసులు రేడియేషన్‌కు గురై అనారోగ్యం సమస్యలు ఏర్పడే పరిస్థితి ప్రమాదకరంగ ఉంటుందని వారు అన్నారు. గ్రామ ప్రజల అభిప్రాయాలను తీసుకోకుండా గ్రామ కాలనీవాసులకు ఇబ్బందికరంగా ఉండే పరిస్థితి ఉందని అన్నారు. సెల్‌టవర్‌ను గ్రామ ప్రజల అనుమతి ఆమోదం లేకుండా నిర్మించటం ఎంత వరకు సబబు అని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలని సంబంధిత అధికారులతో విచారణ జరిపించి గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని, గ్రామానికి దూరంగ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని జగ్గంగూడ గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్‌ను కోరారు.

## 8న కళ్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ

**తలకొండపల్లి ఆగస్టు5, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండలానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారాక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. సోమవారం తలకొండపల్లి మండలంలోని రైతు వేదికలో ఉదయం 11గంటలకు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చేతుల మీదుగా కళ్యాణలక్ష్మీ షాది ముబారాక్ చెక్కులను పంపిణీ కార్యక్రమం ఉంటుందని కావున లబ్ధిదారులు హాజరై తీసుకోవాలని తహసీల్దార్ ఓ ప్రకటనలో తెలిపారు.

## మౌలిక వసతులు కల్పించాలని సర్పంచ్‌కు వినతి



పూడూర్ గ్రామ సర్పంచ్‌కు వినతి పత్రం అందజేస్తున్న 3వ వార్డు ప్రజలు

**మేడ్చల్, ఆగస్టు 5. ప్రభాతవార్త ః**
మేడ్చల్ మండలం పూడూర్ గ్రామంలోని 3వ వార్డులో అభివృద్ధి పనులు చేసి మౌళిక వసతులు కల్పించాలని కోరుతూ ఆ వార్డు ప్రజలు గ్రామ సర్పంచ్ బాబు యాదవ్‌ను కోరుతూ వినతి పత్రం అందజేశారు. వార్డులో డ్రైనేజి, గ్యాస్ పైప్‌లైన్ పనులను చేయించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు గడ్డం భాస్కర్, నాగరాజు, బాబు, మదుసూధన్, పూర్ణ పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి

**కీసర, ఆగస్టు5, ప్రభాతవార్తః**
గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి శాయశక్తులా కృషి చేస్తానని సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోదుమకుంట గ్రామంలోమ శుక్రవారం టిపిఎస్ కాలనీ ఫేస్ 1లో గ్రామ పంచాయతీ నిధులు 8 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మంత్రి మలారెడ్డి సహకారంతో గ్రామాన్ని దశల వారిగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. వార్డు సభ్యులు గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సోమని ఆంజనేయులు, ఎంపిటిసి మంచాల కిరణ్‌జ్యోతి ప్రవీణ్‌కుమార్, వార్డు సభ్యులు పుట్ట బాలరాజుగౌడ్, చీర రజిత శ్రీ మహేష్, సామల ప్రేమ్‌నాథ్‌రెడ్డి, తాండూరి సంధ్య దశరధగౌడ్, నాచారం పద్మ యాదగిరి గౌడ్, మంచాల స్వరూప పెంటయ్య, జంగం శివలింగం యాదవ్, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం



రోగులను పరిశీలిస్తున్న వైద్యులు

**కొడంగల్, ఆగస్టు 5, ప్రభాతవార్త:**
కొడంగల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ కొడంగల్ వారి అధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. కంటి వైద్యులు హరినాథ్ నెహ్రూ అధ్వర్యంలో నిర్వహించిన నేత్ర శిబిరంలో 150 మందికి పైగా హాజరుకాగా వారికి కంటి పరిక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అలాగే ఐఓఎల్ శస్త్ర చికిత్స నిమిత్తం ఎంపిక చేసిన 35 మందిని మహబూబ్‌నగర్ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, సెక్రటరి దాసప్ప యదవ్, సభ్యులు జ్యోతి ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి తీరుపై మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం



వివరాలు అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే

**కొడంగల్, ఆగస్టు 5, ప్రభాతవార్త:**
పేదలకు వైద్యం అందించేందుకు గాను నూతనంగా నిర్మించిన 50 పడకల ఆసుపత్రి భవనంలో వైద్య సేవలు కొనసాగించకపోవడం పట్ల మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయిలు వెచ్చించి 45 రోజుల క్రితం ప్రారంభించిన ఆసుపత్రిలో వైద్య సేవలు ఎందుకు కొనసాగడం లేదని సంబంధిత వైద్యులు గోపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే అసుపత్రి భవనంలో నీరు నిలిచి ఉండటంతో పాటు నాసీరకంగా పనులు చేపట్టడం పట్ల ఒకింత ఆయన అసంతృప్తిని వ్యక్తంచేశారు.

## గ్రామాల్లో ఘనంగా వరలక్ష్మి వ్రతమహోత్సవాలు
### -పూజలు చేసిన మహిళలు

**శామీర్‌పేట, ఆగస్టు 5, ప్రభాతవార్త**
శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలు వరలక్ష్మి వ్రతం పూజా కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. శ్రావణమాసంను పురస్కరించుకుని శుక్రవారం రోజును పురస్కరించుకుని ఇళ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు మహిళలు వరలక్ష్మి వ్రతం పూజల సందర్భంగ మహిళలను ఆహ్వానించుకుని పసుపు, బొట్టును అందజేసుకున్నారు. మహిళలు సాంప్రదాయబద్ధంగ వరలక్ష్మి వ్రతం పూజలు నిర్వహించారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాలతో పాటు తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోనూ పలు గ్రామాల్లో, వార్డులలో మహిళలు శుక్రవారం వరలక్ష్మి వ్రతం పూజలు జరుపుకున్నారు.



.తూంకుంటలో కౌన్సిలర్ ఎద్దు లక్ష్మినాగేష్ వరలక్ష్మి వ్రతం పూజా కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

# చిల్లర వేషాలు మాని..అభివృద్ధిపై దృష్టి పెట్టు

### -ఎమ్మెల్యే ఆనంద్ పై మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

**వికారాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త :** స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ పై మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ తీవ్రంగా మండిపడ్డారు. చిల్లర వేశాలు మాని...నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఉద్ఘాటించారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలో కొండా బాలక్రిష్ణారెడ్డి ఫంక్షన్ హాల్లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా బంట్వారం మండల కేంద్రానికి చెందిన పలు పార్టీల నాయకులు పెద్ద ఎత్తున ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే ఆనంద్ జిత్తులమారి నక్కలా వ్యవహరిస్తూ కాంగ్రెస్ నాయకులపై టీఆర్ఎస్‌లో ఉన్న యువ నాయకులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే రెచ్చగొడితే టీఆర్ఎస్ యువ నాయకులు రెచ్చిపోకుండా మీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలని హితవు పలికారు. ఇద్దరు మాజీ మంత్రులను ఓడగొట్టి గెలిచానని చౌకబారు కామెంట్లు చేయడం సరికాదని, సింహం..పులి కొట్లాడితే నక్కలా బయటపడ్డావని ఉద్ఘాటించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో శివసాగర్ అభివృద్ధికి నిధులు తీసుకువచ్చామని, మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయడం జరిగిందని, 120 కోట్లతో శాటిలైట్ సిటీ కింద అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. చిత్తశుద్ధి ఉంటే నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు తీసుకురావాలని సూచించారు. ఇప్పటికైన ఎమ్మెల్యే తీరు మార్చుకొని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. తన జోలికి..పార్టీ జోలికి.. కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, పూడూరు పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, బంట్వారం మండల పార్టీ అధ్యక్షులు పోచారం వెంకటేశం, వికారాబాద్ మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కిషన్‌నాయక్, మహిపాల్‌రెడ్డి, వాహిద్‌మియా, కమాల్‌రెడ్డి, నర్సిములు, శాకం రాములు, ఎర్రవల్లి జాఫర్, కౌన్సిలర్ మురళి, నాయకులు రెడ్యానాయక్, బంట్వారం నర్సిములు, శ్రీనివాస్, చామల రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యువతి ఉన్నత చదువులకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ సహకారం



మీనాక్షికి ఆర్థిక సహాయం అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

**పెద్దేముల్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** నిరుపేద యువతి ఉన్నత చదువులకు జిల్లా గ్రంథాలయ చైర్మెన్ సహకారం అందించారు. పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామానికి చెందిన సంగని మీనాక్షి ఇంటర్మీడియట్ పూర్తయింది. పేదరికం వల్ల ఉన్నత చదువులు చదవలేకపోయింది. ఇటివలే వాళ్ళ నాన్న లాలప్ప గుండెపోటుతో మృతిచెందారు. ఇట్టి విషయం తెలుసుకున్న జిల్లా గ్రంథాలయ చైర్మెన్ మురళిక్రిష్ణగౌడ్ ఉన్నత చదువుల కోసం మీనాక్షికి రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేసారు. ఇట్టి ఆర్థిక సహాయాన్ని శుక్రవారం సర్పంచ్ వీరప్ప చేతుల మీదుగా అందజేసారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ గ్రామకమీటి అధ్యక్షుడు ముస్తఫా, టిఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ చిన్న సంగమేశ్వర్, కోఆప్షన్ సభ్యులు నసీర్, గ్రామస్థులు టి.శ్రీనివాస్‌రెడ్డి, పి.ప్రకాష్‌రెడ్డి, మైను, ఏ.నాగభూషణం, ఏ.వెంకటయ్య, చంద్రయ్యగౌడ్, ఎస్.బాలు, కె,గుండప్ప, చెర్ల రాములు, మంతటి శ్రీను, అబ్రహం, సి.వెంకటయ్య, బి.అంజి, మంగలి క్రిష్ణ, పి.లక్ష్మయ్య, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పాలతో శిశువులు సంపూర్ణ ఆరోగ్యం : సిడిపిఓ రేణుక



తల్లి పాల వారోత్సవాలలో పాల్గొన్న సిడిపిఓ తదితరులు

**పెద్దేముల్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** తల్లి పాలతోనే శిశువులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సిడిపిఓ రేణుక అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండల పరిధిలోని చైతన్యనగర్‌లో తల్లి పాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ తల్లి పాలలో అధిక పోషకాలు ఉండటంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే వీలైనంత త్వరగా తల్లి పాలు తాగించాలన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు ప్రభుత్వం అందించే పౌష్టికాహరాన్ని సద్వినీయోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు దశమ్మ, యాదమ్మ,ఆయా గ్రామాల అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

### అనుమతి లేకుండా నడుస్తున్న స్కూల్‌ను మూసివేయించిన ఎబివిపి

**మొయినాబాద్ అగస్టు 05, ప్రభాతవార్త :** మొయినాబాద్‌లో అనుమతులు లేకుండా నడుపుతున్న ప్రయివేట్ పాఠశాలను ఎబివిపి విద్యార్థులు సీజ్ చేయించారు. శుక్రవారం మొయినాబాద్ మండల పరిధిలోని శ్రీచైతన్య స్కూల్ అనుమతులు లేకుండా నడిపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న అఖిలభారత విద్యార్థి సంఘం నాయకులు రెడ్డిపల్లి శ్రీకాంత్ శంషాబాద్ విభాగ్ కన్వినర్ ఆధ్వర్యంలో ఎబివిపి విద్యార్థులతో స్కూల్ వద్దకు వెళ్లి ఎంక్వేరి చేయగా పాఠశాలకు ఎలాంటి అనుమతులు లేవని తేలింది. వెంటనే పాఠశాలను మూసివేయించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్‌నేషనల్ పేరుతో ఇష్టానుసారంగా ప్రైయివేట్ పాఠశాలలను నడిపిస్తున్నారని శ్రీచైతన్య స్కూలు విద్యాధికారుల ఆఫీసుకు కూత వేటు దూరంలో ఉన్నా కనీసం పట్టించుకోకుండా మొద్దు నిద్రలో విద్యాధికారులు ఉన్నారని ఆరోపించారు, ఇష్టానుసారంగా రాష్ట్రం మొత్తం లో నిబంధనలకు విరుద్దంగా వేల పాఠశాలలు ఉన్నాయని వెంటనే విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా చర్యలు చేపట్టాలని అన్నారు, నిబంధనలను పాతరేస్తు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వెంటనే కార్పోరేట్ విద్యావ్యవస్థల పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి నగర కార్యదర్శి బట్టువినేయ్, జోన్నాడ శ్రీకాంత్, పుట్నాల వికాస్‌గౌడ్, మణికంఠ తధితరులు పాల్గొన్నారు,

### కవి-రచయితను పరామర్శించిన నాయకులు

**బొంరాస్‌పేట్, ఆగస్టు5ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండలం నాందార్‌పూర్ గ్రామానికి చెందిన కవి,రచయిత మాసని వెంకటయ్య తల్లి మృతి చెందిన విషయం తెలుకున్న ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కట్టెల మల్లేషం అధ్వర్యంలో పలువురు నాయకులు అయన ఇంటికి వెళ్ళి పరామర్శించి ధైర్యం చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో రమేష్‌బాబు,కృష్ణ మౌర్య, శ్రీనివాస్, వెంకటేశం, దస్తప్ప, వెంకటయ్య, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.



రచయితను పరామర్శిస్తున్న నాయకులు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో



కొడంగల్‌లో ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కొడంగల్ రూరల్, ఆగస్టు, 3 (ప్రభాతవార్త):** దేశ ప్రధాని నరేంద్రమోదీ, తెలంగాణ సీఎం కేసీఆర్ పాలనతో ప్రజలు విసుగు చెందారని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ నాయకులు ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, జీఎస్టీ పెంపుకు నిరసనగా శుక్రవారం నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, కోస్గి, మద్దూర్ మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పార్టీ మండలాల అధ్యక్షులు నందారం ప్రశాంత్, నర్సిములుగౌడ్, రఘువర్ధన్‌రెడ్డి, వెంకట్రాములు, నర్సిములు, పట్టణ అధ్యక్షుడు నయీం, మండల వర్కింగ్ ప్రసిడెంట్ ఆనంద్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ తాలూకా అధ్యక్షుడు రెడ్డిశ్రీనివాస్, వార్ల విజయ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఇష్టానుసారంగా నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఆర్టీసీ బస్సు చార్జీలు, విద్యుత్ చార్జీలు, జీఎస్టీని పెంచుతూ సామాన్య, మధ్య తంగతి ప్రజలపై భారం మోపుతున్నారని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ మతతత్వ పార్టీగా సెంటిమెంట్‌తో పాలన కొనసాగిస్తుంటే, రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతుందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయం అన్నారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందించారు. అదే విధంగా వీఆర్ఏల నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపారు. అలాగే హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో పోలీసులు, అధికారులు కలిసి అర్ధరాత్రి మస్జీద్‌ను కూల్చివేయడం హేయమైన చర్య అని ఖండించారు. మస్జీద్‌ను వెంటనే నిర్మించాలని రెవెన్యూ అధికారులకు మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఆసిఫ్‌ఖాన్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రచార కార్యదర్శి యస్.సోమశేఖర్, తార్యానాయక్, శంకర్‌నాయక్, ఇందనూర్ బాల్‌రెడ్డి, రాజునాయక్, యాదిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, టి.శ్రీనివాస్, కె.రాములు, రాంచంద్రారెడ్డి, బి.వెంకట్‌రెడ్డి, ఓంప్రకాశ్, ఎండీ.షాకీర్, హమీద్, అశ్వాక్, జీ.రాము, కలీం, హబీబ్, ఆరీఫ్, ఆసిఫ్, భీమప్ప, మదన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### తాండూరు పట్టణంలో

**తాండూరు టౌన్ ఆగస్టు5,ప్రభాతవార్త :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న తీరుకు నిరసనగా ఏఐసిసి మరియు టిపిసిసి పిలుపు మేరకు తాండూరు పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో తాండూరులోని అంబేద్కర్ కూడలి వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ...బిజెపి ప్రభుత్వం అడ్డగోలుగా నిత్యావసన ధరలను పెంచుతూ పెద ప్రజల నడ్డివిస్తుందన్నారు. అదే విధంగా దేశంలో నిరుద్యోగం పెరుగుతుందన్నారు. వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో తాండూరు పట్టణ సీనియర్ నాయకులు, కార్యర్తలు, తదితరులు పాల్గొన్నారు.



తాండూరులో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

# బ్రహ్మర్షి పితామహ పత్రీజీ అమృతోత్సవం



పత్రీజీ శక్తి స్థల్ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



పత్రీజీ అమృతోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**కడ్తాల్, అగస్టు 5, ప్రభాతవార్త :** ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ధ్యాన గురువు బ్రహ్మర్షి పితామహ పత్రీజీ అమృతోత్సవ కార్యక్రమం శుక్రవారం కడ్తాల్ మండలం అన్మాస్ పల్లి సమీపంలో ఉన్న పిరమిడ్‌లోని ఉదయం 5 గంటల నుండి సరస్వతి ప్రాంగణం ఎదుట పత్రీజీ శక్తిస్థల్ వద్ద అమృతోత్సవ కార్యక్రమంలో పత్రీజీ భార్య స్వర్ణమాల, కుమార్తెలు పరిణత, పరిమళ, వారి కుటుంబ సభ్యులు ట్రస్టీ సభ్యులు పిరమిడ్ మాస్టర్లు అయన అబిమనులతో వాయిద్య సంగీతంతో సమూహ ధ్యానం కార్యక్రమం నిర్వాహించారు, ఈ కార్యక్రమనికి ఎమ్మెల్యే జైపాల్ యదవ్ గారు విచ్చేసి పత్రీజీ శక్తిస్థల్ వద్ద నివాళ్ళు అర్పించారు, అనంతరం ఎమ్మెల్యే మట్లాడుతూ.. మానవళికి ధ్యానం నేర్పడంకోసం40 సంవత్సరాల పాటు తన జీవితన్ని అంకితం చేసి లక్షల మందిని ధ్యాన్యం మల్లించి మార్గనిర్దేశం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని వారు అన్నారు. ఈ సంవత్సరం డిసెంబరులో మహిళ ధాన్య మహాచక్రం పత్రీజీ అసిస్సులతో గణంగా నిర్వాహించుకుందామన్నారు, ఈ క్రార్యక్రమంలో ట్రస్టు చేర్మెన్ విజయ్ భాస్కర్ రెడ్డి, జడ్‌పిటిసి దశరథ్ నాయక్, సింగల్ విండో చేర్మెన్ గంప వేంకటేష్, జోగు వీరయ్య, లచ్చిరాం నాయక్, హరించంద్ నాయక్, సేవ్య, పాండు , పత్రీజీ అబిమనులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా డ్రైనేజీ గుంత..ప్రజల తంట

**ఘట్‌కేసర్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ సాయినగర్‌కాలనీలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ గుంత ప్రమాదకరంగా మారింది. 5వ వార్డు పరిధిలోని శ్రీవిద్యాఆసుపత్రి వెనుక రోడ్డులో డ్రైనేజీపై మ్యాన్‌హోల్ మూత లేక వర్షంతో బురద నిండిపోయింది. రాత్రి పూట గుంతలో పడి పలువురు వాహనదారులు గాయాలపావుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. భారీవర్షాలు ఉన్నాయని వాతావరణశాఖ ప్రకటించగానే అధికారులు, సిబ్బంది అప్రమత్తమై అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నామని చెబుతున్నారని కానీ ఇలాంటి డ్రైనేజీ గుంత సమస్యను పరిష్కరించడంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. వర్షం నీరు రోడ్డుపై నిలిస్తే ఇక్కడ గుంత ఉన్నట్లు ఎవరికి తెలియని పరిస్థితి నెలకొంది. గుంతలో ఎవరు పడకుండా స్థానికులు దానిపై కర్ర వేసి ముందు జాగ్రత్తను సూచించారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది హరితహారం, పారిశుద్యం నిర్వహిస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేసుకుంటారే గానీ కాలనీల్లో ఇలాంటి సమస్యల వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఘట్‌కేసర్ సాయినగర్‌లో ప్రమాదకరంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్ గుంత

## మహిళ అదృశ్యం

**మేడ్చల్, ఆగస్టు 5. ప్రభాతవార్త :** ఇంటి నుంచి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్‌లోని వెంకట్రామయ్య కాలనీకి చెందిన హరిక (22) శుక్రవారం ఉదయం మండలంలోని డబిల్‌పూర్ గ్రామానికని ఇంటినుంచి బయలుదేరి వెళ్లింది. కాని ఆమె సాయంత్రం వరకు కూడ డబిల్‌పూర్‌కుచేరుకోలేదు. దీంతో ఆమె కోసం వెతికినా ఆచూకి లభించకపోవడంతో కుటుంబసభ్యులు మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

**కీసర, ఆగస్టు5, ప్రభాతవార్త:** ఈతకు వెళ్లి విద్యార్థి మృతి చెందిన సంఘటన శుక్రవారం కీసర మండలంలో చోటుచేసుకుంది. కీసర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కీసర గ్రామానికి చెందిన మణికంఠ (14) కీసర ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం వరలక్ష్మీవ్రతం సెలవు దినం కావడంతో స్నేహితులతో కలిసి వన్నిగూడ గ్రామంలోని ఒక క్వారీ గుంతలో సరదాగా ఈతకు వెళ్లాడు. స్నేహితులతో కలిసి క్వారీ గుంతలో దిగిన మణికంఠ ఈత రాక పోవడంతో మునిగిపోతుండటంతో స్నేహితులు కాపాడే ప్రయత్నం చేయగా లాభం లేకుండా పోయింది. దీంతో మణికంఠ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసును కీసర పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# విఆర్ఏలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

### బొంరాస్‌పేట్ మండలంలో

**బొంరాస్‌పేట్, ఆగస్టు5ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యలయం ఆవరణలో 12వ రోజుకు చేరిన విఆర్ఏల రిలే నిరహర దీక్షకు మండల టీఎస్‌యూటీఎఫ్ శాఖ పక్షన శుక్రవారం నాడు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. విఆర్ఏలకు ప్రభుత్వం హామీ ప్రకారం పే స్కేల్‌ను వెంటనే మంజూరు చేయాలన్నారు. 50 సంవత్సరాల వయస్సు నిండిన వారందరికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని, కుటుంబంలో అర్హులైన ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. సీనియార్టిని బట్టి పదోన్నతులు కల్పించి వారి న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిస్కరించాలని వారుకోరారు. ఈ కార్యక్రమంలో టీవివి అధ్యక్షులు రవీందర్‌గౌడ్, గౌరారం గోపాల్, అనిల్‌కుమార్, చంద్రశేఖర్, విఆర్ఏ సంఘం నాయకులు పాల్గొన్నారు.

### కొడంగల్ మండలంలో

**కొడంగల్, ఆగస్టు 5, ప్రభాతవార్త :** విఆర్ఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యాక్షులు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. విఆర్ఏలు చేస్తున్న 12వ రోజు నిరవధిక సమ్మెకు ఆయన హాజరై మద్దతు తెలిపారు. ఈసందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్రంలో 22 వేల మంది గ్రామ రెవిన్యూ సహాయకులుగా సేవలందిస్తున్నాంని, ఏళ్ళ తరబడి ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు లేకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారిందని అన్నారు. విఆర్ఏలు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం గుర్తించి వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు విష్ణుకుమార్, బసప్ప, ఆశప్ప, వెంకట్‌రాములు తదితరులు పాల్గొన్నారు.

### పూడూరు మండలంలో

**పూడూరు, ఆగస్టు 5, ప్రభాతవార్త :** సిఎం కేసీఆర్ అసెంబ్లీలో విఆర్ఎలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, పరిగి మాజీ ఎమ్మెల్యే టి రామ్మోహన్ డిమాడ్ చేశారు. పూడూరు మండల కేంద్రంలో విఆర్ఎల డిమాండ్ల సాధనకు నిర్వహిస్తున్న నిరవదిక సమ్మెకు శుక్రవారం సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని పలుమార్లు రాష్ట్రప్రభుత్వం దృష్టికి తెచ్చినా పట్టించుకోక పోవడంపట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వీఆర్ఏల డిమాండ్లను పరిష్కరించాలని, లేదంటే వారి పోరాటానికి పూర్తి మద్దత్తు ప్రకటించి ఉధ్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రానున్న రోజుల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, వీఆర్ఏల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాజుల శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, విఆర్ఏలు సంతోష్, జంగయ్య, శ్రీనివాస్, లింగం, అనంతయ్య, లవకుమార్, చంద్రయ్య, రాంచంద్రయ్య, అంజనేయులు పాల్గొన్నారు.



విఆర్ఏలకు మద్దతుగా రిలే నిరహర దీక్షలో పాల్గోన్న ఉపాధ్యాయులు.



పూడూరు మండల విఆర్ఎల సమ్మెకు మద్దత్తు తెలుపుతున్న డిసిసి అధ్యక్షుడు టి రామ్మోహన్‌రెడ్డి తదితరులు

# పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపం

### -పేర్కంపల్లి వంతెన నిర్మాణంలో పాలకులది మొద్దు నిద్ర
### -బిజెపి మండల పార్టీ అధ్యక్షుల డిమాండ్



నత్తనడకన సాగుతున్న పేర్కంపల్లి బ్రిడ్జి వద్ద బిజెపి నాయకులు

**యాలాల ఆగష్టు 5,ప్రభాతవార్త :** యాలాల మండల పరిధిలోని పేర్కంపల్లిలో అర్ధాంతరంగా నిలిచిన వంతెన నిర్మాణంలో పాలకులు మొద్దు నిద్ర వీడాలని యాలాల మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు మహిపాల్ యాదవ్‌డిమాండ్ చేశారు. శుక్రవారం మండల బిజెపి నాయకులు నారాయణరెడ్డి, రామ్యానాయక్, చాకలి కృష్ణ, పేర్కంపల్లి, ఎన్కేపల్లి గ్రామాల ప్రజలతో కలిసి అర్ధాంతరంగా ఆగిపోయిన బ్రిడ్జి పనులను సందర్శించి పరిశీలించారు. బ్రిడ్జి పనులు నత్త నడకన కొనసాగడంతో రెండు గ్రామాల ప్రజలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రజలుఇతరప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయన్నారు. ఎమ్మెల్యే, ఎమన ఎమ్మెల్సీ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌లు స్పందించిబ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వేల, లక్షల కోట్ల నిధులతో ప్రాజెక్టులు కడుతున్నట్లు పేర్కొంటున్న కెసిఆర్ సర్కార్‌లో చిన్న చిన్న వంతెన, శివసాగ్ ప్రాజెక్టును పూర్తి చేయలేకపోవడంసిగ్గుచేటని వారు విమర్శించారు. బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలని, ప్రజల అవస్థలకు కారణమ వుతున్న సదరు కాంట్రాక్టరును బ్లాక్ మేయిల్‌లో పెట్టాలని వారు కోరారు.

## రైతు రుణమాఫీ కోసం సంతకాల సేకరణ



సంతకాల సేరణ నిర్వహిస్తున్న బిజెపి నాయకులు

**బొంరాస్‌పేట్, ఆగస్టు5ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని వెంటనే అమలు చేయాలని బిజెపి పార్టీ అధ్వర్యంలో నూతన మండలం దుద్యాల్‌లో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని షకనప్ప తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018 ఎన్నికల సమయంలో ఇచ్చిన హమీ ప్రకారం రైతులకు లక్ష రూపాయాల రుణాలను వడ్డీతో సహ రుణమాఫీ చేయాలన్నారు. కేంద్రప్రభుత్వం రైతుల కోసం తీసుకువచ్చిన ప్రధానమంత్రి ఫసల్ పంటలభీమాను రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు రుణమాఫీ కాకపోవడంతో పంటపెట్టుబడి కోసం ప్రవేట్ వడ్డీ వ్యాపారుల దగ్గర అధిక వడ్డీకి రుణాలు తీసుకోని తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కూర వెంకటయ్య, విశ్వనాథం, మేకల నర్సిములు, కాలిగే విజ్జు, తదితరులు పాల్గోన్నారు.


## నూతన ఆలయానికి భూమిపూజ



సర్దార్‌నగర్‌లో ప్రత్యేక పూజలు చేస్తున్న టీపీసీసీ కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి

**షాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త :** మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలోని పశువుల ఆసుపత్రి వద్ద గల వేపచెట్టు కొమ్మల మధ్య అమ్మవారి కళ్ల ఆకృతి ప్రత్యక్షమైనందున శ్రావణ శుక్రవారంను పురస్కరించుకుని టీపీసీసీ కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి తనసొంత డబ్బులతో నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఇక్కడ అమ్మవారు కొలువై ఉండేదని, అందువలన వేపచెట్టుకు అమ్మవారి రూపం పోలిన విధంగా రెండు కళ్ల ఆకృతి ప్రత్యేక్షమైనందున, గ్రామస్థులు, మహిళల కోరిక మేరకు అమ్మవారి గుడి నిర్మాణం చేయాలని కోరగా, గుడి నిర్మాణం కోసం సొంత డబ్బులతో నిర్మిస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కావలి చంద్రశేఖర్, మహిళా అధ్యక్షురాలు అశ్విని, ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, బీసీసెల్ మండల అధ్యక్షులు చంద్రయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, చెన్నయ్య, శేఖర్, బుచ్చయ్య, జంగయ్య, ఖుద్దూస్, ఆశోక్, శేఖర్, సత్యం, గౌరీశ్వర్, గౌతం, కిరణ్, నవీన్, ఆశోక్, రాజు తదితరులు ఉన్నారు.

## చందన్‌వెల్లి భూనిర్వాసితులకు న్యాయం చేయాలి



హైతాబాద్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న చందన్‌వెల్లి భూనిర్వాసితులు

**షాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త :** చందన్‌వెల్లిలో సర్వే నెం.190లో అవకతవకలు జరిగాయని, బాధితులకు ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని శుక్రవారం హైతాబాద్‌లో రైతులు 6వ రోజు దీక్షకు బీజేపీ, బీఎస్పీ నాయకులు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.... చందన్‌వెల్లి భూముల్లోని సర్వే నెం.190లో జరిగిన అవకతవకలు, నష్టపరిహారం అందలేదన్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. చందన్‌వెల్లి భూనిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌రెడ్డి, అనంతం, నీరటి ఆంజనేయులు, విజయార్య, వెంకటేశ్వర్లు, రైతులు అంతయ్య, యాదయ్య, భీములు, శోభ, దయాకర్, రాంబాబు, నర్సింహ్మారెడ్డి, జంగయ్య, అంజయ్య, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

## విద్యుత్ షాక్‌తో గొర్రెలు మృతి

**చౌడపూర్ ఆగస్టు5,ప్రభాతవార్త :** మండల పరిధిలోని కన్మన్ కల్వ గ్రామంలో విద్యుత్ షాక్ గురై గొర్రెలు మృతి చెందాయి. కన్మన్ కల్వ గ్రామానికి చెందిన నక్క రాజు, తన గొర్రెలను మేపుకొని తిరిగి వస్తుండగా దారిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్డర్‌కు గొర్రెలు తాకి విద్యుత్ షాక్‌కు గురయ్యాయి. అక్కడికక్కడ రెండు గొర్రెలు మృతి చెందాయి. రెండు గొర్రెల విలువ సుమారుగా 20వేల రూపాయలు ఉంటుందని ,గొర్రెలు పెంచుకుని అమ్ముకోవడమే నా జీవనోపాధి అని, నష్టపరిహారం చెల్లాంచాలని గొర్రెల కాపరి రాజు కోరారు.



విద్యాద్ షాక్‌తో మృతి చెందిన గొర్రెలు